తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 69 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ శుక్రవారం 11-10-2024 వెల: 5/రూ -




# 9 మంది ఐఏఎస్‌లు ఏపీకే!

- ఏపీ కేడర్‌కు ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్‌లు
- తెలంగాణ నుంచి ఏపీకి ఐదుగురు ఐఏఎస్‌లు.. ఏపీలోనే కొనసాగనున్న ఇద్దరు ఐఏఎస్‌లు
- తెలంగాణ నుంచి ఏపీకి ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష్ బిష్త్
- ఏపీ నుంచి తెలంగాణ కేడర్‌కు మరో ముగ్గురు ఐఏఎస్‌లు
- ఏపీ, తెలంగాణ మధ్య ఏఐఎస్ అధికారుల తుది కేటాయింపులపై డీవోపీటీ కీలక నిర్ణయం
- ప్రస్తుత రాష్ట్ర కేడర్ నుంచి ఈ అధికారులను తక్షణమే రిలీవ్ చేస్తున్నట్లు ప్రకటన
- ఈ నెల 16లోగా పొరుగు రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశం

# టాటాకు వీడ్కోలు

## జనం మెచ్చిన పారిశ్రామిక దిగ్గజం

- ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు
- 21 సార్లు తుపాకులు పేల్చి పోలీసుల గౌరవ వందనం
- అమిత్ షా, చంద్రబాబు, పవార్, సచిన్,అంబానీ, బిర్లా తదితరుల నివాళి
- వేలాదిగా తరలివచ్చిన సామాన్యులు హిందు, ముస్లిం, క్రైస్తవ, సిక్కు గురువుల ప్రార్థనలు
- పార్శీ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు
- ఒక రోజు సంతాప దినంప్రకటించిన 6 రాష్ట్రాల ప్రభుత్వాలు



ముంబై, అక్టోబరు 10: ప్రజలు మెచ్చిన దిగ్గజ పారిశ్రామికవేత్త.. టాటా గ్రూప్ గౌరవ అధ్యక్షుడు.. రతన్ టాటా అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో, ముంబైలోని వర్లీ దహనవాటికలో జరిగాయి. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, మరో మంత్రి పియూష్ గోయల్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఏపీ సీఎం చంద్రబాబు సహా ఎందరో ప్రముఖులు అంత్యక్రియలకు హాజరై రతన్ టాటాకు నివాళులర్పించారు. తన దాతృత్వ గుణంతో అందరి మన్ననలూ చూరగొన్న ఆ వితరణశీలికి యావద్దేశంకన్నీటితో అంజలి ఘటించింది. మహారాష్ట్ర,


- మిగతా 2వ పేజీలో


# కొండా సురేఖకు సమన్లు!

**నాగార్జున కేసులో విచారణకు రావాలి**

**23న వచ్చి వివరణ ఇవ్వాలి: నాంపల్లి కోర్టు**

**సురేఖపై కేటీఆర్ క్రిమినల్ పరువునష్టం దావా**

**వ్యక్తిత్వ హననానికి ప్రయత్నించారని ఫిర్యాదు**

హైదరాబాద్, అక్టోబరు 10 : మంత్రి కొండా సురేఖపై సినీ హీరో అక్కినేని నాగార్జున వేసిన క్రిమినల్ పరువు నష్టం దావా కేసులో ఆమెకు న్యాయస్థానం సమన్లు ఇచ్చింది. గురువారం నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో రెండో సాక్షి మెట్ల వెంకటేశ్వర్ కొండా సురేఖ వ్యాఖ్యలకు సంబంధించి వాంగ్మూలం ఇచ్చారు. అంతకుముందు నాగార్జున, సుప్రియ ఇచ్చిన వాంగ్మూలాలను కూడా పరిశీలించిన న్యాయస్థానం మంత్రి కొండా సురేఖను ఈ నెల 23న కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను 23వ తేదీకి వాయిదా వేసింది. మరో వైపు ఇవే వ్యాఖ్యలకు సంబంధించి కొండా సురేఖపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాంపల్లి కోర్టులో గురువారం క్రిమినల్ పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు వచ్చే సోమవారం విచారణకు వచ్చే అవకాశముంది. సినీ నటులు నాగ చైతన్య, సమంత విడాకులకు తానే కారణమంటూ సురేఖ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగత ప్రతిష్ఠకు నష్టం చేకూర్చాయని కేటీఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పని చేసిన తనపై సురేఖ నిరాధారమైన విమర్శలు చేసి


(మిగతా 2వ పేజీలో)





2లో





2లో


## ఆదాయం లీకేజీని

# అరికట్టండి!

- వాణిజ్య పన్నులు, గనులు, ఇసుకపై దృష్టి పెట్టండి
- ఇసుక పక్కదారి పట్టకుండా రీచ్‌లలో కెమెరాలు
- ప్రజలపై భారం పడకుండావసూళ్లు పెరగాలి
- పరిశ్రమలకు వాడని ప్రభుత్వ భూములు వెనక్కి
- స్వగృహ ఇళ్ల అమ్మకాలపై తొందరగా నిర్ణయం
- శాఖలు సమన్వయంతో రాబడి పెంచాలి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్
- కొత్తగా 28 సమీకృత గురుకులాలు
- కార్పొరేట్ స్థాయిలో.. ఒక్కోటి 20 ఎకరాల్లో
- ఉత్తర్వులు జారీ.. నేడు శంకుస్థాపనలు
- కొందుర్గులో భూమి పూజ చేయనున్న సీఎం

# పోలవరానికి తొలిసారి అడ్వాన్సు!




2లో


- రూ.2,424.46 కోట్లు ముందస్తుగా విడుదల చేసిన కేంద్రం
- రాష్ట్రానికి జలశక్తి శాఖ సమాచారం ఇందులో రీయింబర్స్‌మెంట్ 76 కోట్లు
- మిగతా 2,348 కోట్లు మొదటి విడత అడ్వాన్సు!

# పోలవరానికి తొలిసారి అడ్వాన్సు!

అమరావతి, అక్టోబరు పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాక తొలిసారి కేంద్రం ముందస్తుగా నిధులు విడుదల చేసింది. వచ్చే నెల నుంచి కీలక నిర్మాణ పనులను ప్రారంభించనున్న తరుణంలో రాష్ట్రానికి రూ.2,424.463 కోట్లు అడ్వాన్సుగా ఇవ్వాలని కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయించింది. సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ) కింద 8000 కంటింజెన్సీ ఫండ్, 00 కంటెంజెన్సీ ఫండ్, 201 అప్రాప్రియేషన్స్ ఫ్రమ్ ది కన్సాలిడెటెడ్ ఫండ్, 00 డిఫాల్ట్ ఖాతాల్లో ఈ నిధులను జమచేయాలని బుధవారం తన అకౌంట్స్ విభాగానికి ఆదేశాలిచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చేపట్టిన పనులకు గాను రూ.76.463 కోట్లను రీయింబర్స్‌మెంట్ కింద.. వచ్చే ఏడాది మార్చి 31 దాకా నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.2,348 కోట్లను అడ్వాన్సుగా విడుదల చేసింది. వాస్తవానికి ఇలా అడ్వాన్సుగా నిధులు ఇచ్చే విధానం కేంద్రానికి లేదు. రాష్ట్రప్రభుత్వం తన సొంత డబ్బులు ఖర్చుపెట్టి బిల్లులు పెడితే పరిశీలించి రీయింబర్స్ చేస్తుంటుంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ముందస్తుగా నిధులివ్వాలని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీని అభ్యర్థించడంతో తొలిసారిగా పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సు రూపంలో నిధులు మంజూరు చేసింది. వాస్తవానికి పోలవరం తొలి దశ పనులకు, భూ సేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలకు రూ.12,567 కోట్లు కావాలని జలశక్తి శాఖను రాష్ట్రం కోరింది. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఈ శాఖ ఆ మొత్తం విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు సిఫారసు చేసింది. ఈ సిఫారసులను ఈ ఏడాది మే నెలలో కేంద్ర కేబినెట్ ఆమోదానికి ఆర్థిక శాఖ పంపింది. కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ మొత్తంలో ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చే మార్చి నెలాఖరు వరకు ఖర్చుచేయడానికి 7,218.68 కోట్లను ముందుగా విడుదల చేయాలని రాష్ట్రం కోరింది. సదరు ప్రతిపాదనలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) మదింపు చేసి.. ఏకంగా రూ.2,276.76 కోట్లకు కోత వేసింది. 4,941.92 కోట్లకు మాత్రమే ఆమోదిస్తూ గత నెల 30వ తేదీన జలశక్తి శాఖకు పంపింది. ఇందులో ఇప్పుడు రూ.2,424.463 కోట్లను ఆ శాఖ తొలివిడతగా విడుదల చేసింది. ఇక నవంబరు నుంచి ప్రారంభించే డయాఫ్రం వాల్ పనులకు నిధుల కొరత ఉండదని జల వనరుల శాఖ హర్షం వ్యక్తం చేస్తోంది. అడ్వాన్సుగా ఇచ్చిన రూ.2,348 కోట్లలో రూ.990 కోట్లు వాల్‌కు ఖర్చుచేయాలని భావిస్తోంది. కాగా.. పోలవరానికి విడుదల చేసే నిధుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని జలశక్తి శాఖ రాష్ట్రాన్ని ఇప్పటికే ఆదేశించింది. కేంద్ర ప్రాయోజిత పథకం కింద పోలవరాన్ని నిర్మిస్తున్నందున ప్రత్యేక అకౌంట్‌ను ప్రారంభించేందుకు సీఎసపీ నంబర్‌ను పంపాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఆ నంబర్‌ను పంపగానే ప్రత్యేక ఖాతా తెరవనుంది.

# ఈవీఎంలను హ్యాక్ చేశారని ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు




న్యూఢిల్లీ, అక్టోబరు 9: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేసింది. ఏఐసీసీ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఢిల్లీలోని ఎన్నికల సం ఘం ప్రధాన కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. కనీసం 20 నియోజకవర్గాల్లో ఈవీఎంలను హ్యాక్ చేశారని చెబుతూ 7 నియోజకవర్గాల్లో జరిగిన అవకతవకలపై ఆధారాలు సమర్పించినట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వెల్లడించారు. మిగతా 13 నియోజకవర్గాలకు సంబంధించిన ఆధారాలు 48 గంటల్లో సమర్పిస్తామని ఈసీకి తెలిపామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిన చోట్ల ఈవీఎంల బ్యాటరీ ఛార్జింగ్ 99% చూపాయని, అభ్యర్థులు గెలిచిన చోట్ల ఈవీఎం ల బ్యాటరీ ఛార్జింగ్ 60%-70% మాత్రమే ఉందని ఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# బద్రినారాయణుడిగా మలయప్ప

**నేటితో వాహనసేవలు పరిసమాప్తం**

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గురువారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై మలయప్ప స్వామి కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్యలో సూర్యప్రభపై బద్రినారాయణుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. చిరుజల్లుల మధ్య వాహనసేవ వైభవంగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తిని పటాటోపం నడుమ ఊరేగించాల్సి వచ్చింది. రాత్రి చంద్రప్రభ వాహనంపై మలయప్పస్వామి భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోసతవాల్లో మరో ప్రధాన వాహనమైన మహా రథోత్సవం శుక్రవారం ఉదయం జరుగనుంది. రాత్రి అశ్వవాహనంతో బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు ముగుస్తాయి. శనివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.



# టాటాకు వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)



ఝార?ండ్, గుజరాత్ సహా ఆరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆయన మృతికి నివాళిగా ఒకరోజు సంతాప దినంగా ప్రకటించాయి. అధికారిక కార్యక్రమాలను సైతం రద్దు చేశాయి. దముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన రతన్ టాటా భౌతికకాయానికి.. నాసేసలార్లు (అంతిమ సంస్కారాలకు సంబంధించిన క్రియలు చేయించేవారు) గురువారం ఉదయాన్నే స్నానం చేయించి, తెల్లటి సుద్రేహ్ (అంగీ), నడుము చుట్టూ 'కుస్తీ (పార్శీలు పవిత్రంగా భావించే తాడు)' ధరింపజేశారు. పార్శీ పురోహితులు కొంతసేపు ప్రార్థనలు చేశారు. టాటా కుటుంబసభ్యులంతా ఆయనకు తుదినివాళులర్పించారు. ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ సహా కొందరు ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని శవపేటికలో ఉంచి, పుష్పాలతో అలంకరించి.. కుటుంబసభ్యులు, చివరిదశలో ఆయనకు అత్యంత సన్నిహితుడైన శాంతను నాయుడు తదితరులు వెంటరాగా.. దక్షిణ ముంబైలోని నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎన్‌సీపీ) ప్రాంగణానికి తరలించారు. ఉదయం 10.30 గంటల నుంచి ఆయన పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం అక్కడ ఉంచారు. హిందు, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, పార్శీ మతగురువులు పక్కపక్కనే నిలబడి.. భుజంభుజం కలిపి.. ఆయన ఆత్మశాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ తన కుటుంబంతో సహా విచ్చేసి రతన్‌టాటాకు అంజలి ఘటించారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్, ఆదిత్యబిర్లా గ్రూపు అధిపతి కుమార్ మంగళం బిర్లా, సీనియర్ బ్యాంకర్ దీపక్ పరేఖ్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియ శూలె, ఎంఎన్ఎస చీఫ్ రాజ్ ఠాక్రే తదితర రాజకీయ, వ్యాపార ప్రముఖులు టాటా భౌతిక కాయాన్ని సందర్శించారు. ఆయన్ను తమ రోల్‌మోడల్‌గా భావించే ప్రజలు వేలాదిగా తరలివచ్చి, పొడుగాటి క్యూలైన్లలో నిలబడి, నిరీక్షించి.. జాతీయ పతాకంలో చుట్టి ఉన్న రతన్ టాటాను చివరిసారి చూసుకుని కన్నీటి నివాళులర్పించారు. జనం పోటెత్తి ఒకదశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు పరిస్థితిని చక్కదిద్దడానికి తమ లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. సాయంత్రం 3.55 గంటల అనంతరం రతన్ టాటా పార్థివదేహాన్ని.. అక్కడికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న వర్లీ ఎలక్ట్రిక్ క్రిమెటోరియానికి తరలిస్తుండగా దారిపొడుగునా ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. క్రిమెటోరియానికి చేరుకున్నాక.. అక్కడి ప్రేయర్ హాల్‌లో 45 నిమిషాలసేపు ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత పోలీసులు 21సార్లు తుపాకులు పేల్చి గౌరవ వందనం సమర్పించారు.

# ఆదాయం లీకేజీని అరికట్టండి!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయడంపై చర్చించారు. రీచ్‌ల నుంచి వెళ్తున్న ఇసుక పక్కదారి పట్టకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. గనుల శాఖకు సంబంధించి రాయల్టీలు, లీజుల వసూలు, కొత్త గనుల అనుమతులు, నూతన ఆదాయ మార్గాలపై చర్చించారు కాగా, రాజీవ్ స్వగృహకు సంబంధించిన ఫ్లాట్లు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్నాయని సమావేశంలో అధికారులు తెలిపారు. వీటన్నిటి నిర్మాణాలు ఇప్పటికే దాదాపు పూర్తి అయ్యాయని, కొన్నిచోట్ల మాత్రమే కొంత శాతం పనులు మిగిలి ఉన్నాయని, తక్కువ ఖర్చుతో వీటిని పూర్తి చేయవచ్చని వివరించారు. వీటిని విక్రయిస్తే దాదాపు రూ.1500 కోట్లు వస్తాయని అంచనా వేశారు. గతంలోనూ ఈ ఆలోచన చేసినా అన్ని ఫ్లాట్లు అమ్ముడు పోలేదు. ఈ ఫ్లాట్లు విక్రయించే అంశంపై త్వరితగతిన ఓ నిర్ణయం తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. గతంలో ప్రైవేటు సంస్థలకు కేటాయించిన ప్రభుత్వ భూములను పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించకుంటే వెనక్కి తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ విషయంపై ఇటీవలే హైకోర్టు సైతం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఇలాంటి భూములు రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఏ మేర ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వాదాయం పెంచేందుకు కీలక శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చెప్పారు. కొత్త ఆదాయ మార్గాలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. సమీక్షలో రిజ్వీ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, హౌసింగ్ కార్యదర్శి బుద్ధప్రకాష్ పాల్గొన్నారు.

# కొండా సురేఖకు సమన్లు!

వ్యక్తిత్వ హననానికి ప్రయత్నించారని అన్నారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి తొమ్మిదేళ్ల పాటు మంత్రి హోదాలో రాష్ట్ర ప్రగతి కోసం అనేక అభివృద్ధి పనులు చేపట్టానని కేటీఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాంటి తనపై రాజకీయంగా బురద జల్లేందుకు ఫోన్ ట్యాపింగ్, సినీ రంగ ప్రముఖులను బెదిరించడం, డ్రగ్స్, రేవ్ పార్టీలంటూ తనకు ఎలాంటి సంబంధం లేని అవాస్తవ విషయాలను ఆపాదిస్తూ అసత్యాలను కొండా సురేఖ మీడియా ముందు మాట్లాడి తన గౌరవ మర్యాదలకు భంగం కలిగించారని కేటీఆర్ పేర్కొన్నారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం సురేఖపై క్రిమినల్ పరువు నష్టం కేసు నమోదు చేయాలని తన ప్రైవేట్ ఫిర్యాదులో కోరారు. ఈ కేసులో సాక్షులుగా తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌లను పేర్కొన్నారు. కొండా సురేఖ చేసిన వివాదస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు, టీవీ చానెళ్లలో ప్రసారమైన వార్తలు, పత్రికల్లో, వెబ్‌సైట్లలో ప్రచురితమైన వార్తా కథనాలను కలిపి మొత్తం 23 ఆధారాలను కోర్టుకు కేటీఆర్ న్యాయవాదులు సమర్పించారు.



# సింఘ్వీని రాజ్యసభకు పంపింది అందుకే!

- రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఆయన్ను ఎన్నుకున్నాం
- చట్టసభలు, కోర్టుల్లో తన వాణిని బలంగా వినిపిస్తారు
- సింఘ్వీ సన్మాన సభలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా అభిషేక్ మను సింఘ్వీ ప్రాతినిధ్యం వహించడం మన రాష్ట్రానికి గర్వకారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దేశంలోని అతికొద్ది మంది నిష్ణాతులైన న్యాయవాదుల్లో సింఘ్వీ ఒకరని కొనియాడారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సింఘ్వీకి మాజీ ఎంపీ గిరీష్ సంఘీ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తరపున సింఘ్వీ రాజ్యసభలో ప్రాతినిధ్యం వహించడాన్ని రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్షం గర్వంగా భావిస్తోందన్నారు. ఆయనకు ఓటు వేసి, రాజ్యసభకు పంపే అవకాశం తమకు లభించినందుకు సంతోషిస్తున్నట్లు చెప్పారు. సింఘ్వీ వాదనలు వినడానికే చాలామంది కోర్టుకు వస్తారన్నారు. ఆయన చరిత్రాత్మక కేసులెన్నింటినో వాదించారని, ప్రజాహిత చట్టాలను నిలబెట్టడం కోసం పోరాడారని చెప్పారు. అత్యున్నత న్యాయవాదుల్లో ఒకరైన ఆయన.. మన రాష్ట్రం తరఫున పెద్దల సభలో గొంతు వినిపించబోతున్నారని తెలిపారు. మన వాదనలను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచడమేగాక, కోర్టుల్లో కూడా బలంగా వాదించి, రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే గొంతు కోసం చూస్తే.. సింఘ్వీ తప్ప మరొకరు కనిపించలేదని చెప్పారు. విభజన చట్టంలో కొన్ని అంశాలు కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్నాయని, అటు చట్టసభలు, ఇటు న్యాయస్థానాల్లో రాష్ట్ర ప్రయోజనాల గురించి గట్టిగా ప్రశ్నిస్తారనే నమ్మకంతోనే తాము ఇక్కడి నుంచి పోటీ చేయాలని ఆయన్ని ఆహ్వానించినట్లు తెలిపారు. సింఘ్వీ మాట్లాడుతూ.. రాజ్యసభలో తాను, గిరీష్ సంఘీ బెంచ్‌మేట్స్ అన్నారు. రాజ్యసభకు ఎన్నిక కావడం ఇది నాలుగోసారన్న ఆయన.. గతంలో రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించానని, ఇప్పుడు తెలంగాణ నుంచి వెళ్లానని చెప్పారు. తెలంగాణ ఆత్మీయత తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు.




# 9 మంది ఐఏఎస్‌లు ఏపీకే!

హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య అఖిల భారత సర్వీసుల (ఏఐఎస్) అధికారుల తుది కేటాయింపుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలన్న ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులను తిరస్కరించింది. వారిలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం ఏపీలోనే పనిచేస్తుండగా మిగిలిన ఐదుగురు తెలంగాణలో పనిచేస్తున్నారు. అదేవిధంగా తమను తెలంగాణ కేడర్‌కు బదులు ఏపీ కేడర్‌కు కేటాయించాలన్న మరో ముగ్గురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తులనూ తిరస్కరించింది. తక్షణమే వారిని ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ చేయడంతోపాటు ఈ నెల 16లోగా పొరుగు రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఐఏఎస్ అధికారులు షంషేర్ సింగ్ రావత్, జి.అనంతరాము ప్రస్తుతం ఆ రాష్ట్రంలోనే పనిచేస్తూ తమను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ఆ విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించి వారిద్దరినీ ఏపీలోనే కొనసాగాలని ఆదేశించింది. మిగిలిన వారంతా ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రాన్ని వదిలేసి పొరుగు రాష్ట్రానికి వెళ్లకతప్పని పరిస్థితి ఏర్పడింది.

**వివాదం నేపథ్యం ఇది...**

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యుష్ సిన్హా కమిటీ సిఫారసుల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఏఐఎస్ అధికారుల కేటాయింపులను కేంద్రం చేపట్టింది. ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, కాటా ఆమ్రపాలి, జి.అనంతరాము, ఎం. ప్రశాంతి, వాకాటి కరుణ, ఎ.వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, ఎస్ఎస్ రావత్‌లను ఏపీ కేడర్‌కు.. హరికిరణ్, జి. సృజన, శివశంకర్ లహోటిలను తెలంగాణ కేడర్‌కు కేటాయించింది. ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిష్త్, అభిషేక్ మహంతిని ఏపీకి కేటాయించారు. అయితే ఈ కేటాయింపులను సవాల్ చేస్తూ ఆయా ఐఏఎస్, ఐపీఎస్‌లు గతంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. వారి వాదనలు విన్న ట్రిబ్యునల్.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కొట్టేస్తూ 2017లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును రద్దు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో 2017, 2018లో వేర్వేరు అప్పీళ్లను దాఖలు చేసింది. సోమేశ కుమార్‌ను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన తీర్పుపై తొలుత విచారణ చేపట్టిన హైకోర్టు... ఆ కేటాయింపును రద్దు చేస్తూ తక్షణమే ఏపీలో రిపోర్టు చేయాలని 2023 జనవరి 10న తీర్పు ఇచ్చింది. ప్రత్యుష్ సిన్హా కమిటీ సిఫారసులను సమర్థించింది. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోస్టులో ఉన్న సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లి రిపోర్టు చేశారు. ఈ తీర్పును నాటి తెలంగాణ డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు ఇతర ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకూ వర్తింపజేయాలంటూ కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టి జనవరి 3న తీర్పునిచ్చింది.



## ఘనంగా దాస అంజన్న జన్మదిన వేడుకలు

**సిద్ధిపేట (డైలీ రిపోర్ట్) , అక్టోబర్ 10 :** సిద్ధిపేటలో టీపీసీసీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ దాస అంజయ్య జన్మదిన వేడుకలను గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు. , కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సిద్ధిపేట అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిమి భిక్షపతి , జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పుట్ల యేసు , సిద్ధిపేట అర్బన్ మండలం కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు పెంబర్ల మల్లేశం , కాంగ్రెస్ నాయకులు ఐరేని లింగం, పిట్ల బాలకృష్ణ , గందే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మోకిలా సఫైర్ అపార్ట్మెంట్లో సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళ అధ్యక్షురాలు చైత్రిక

**శంకర్పల్లి అక్టోబర్ 10 (డైలీ రిపోర్ట్):** శంకర్పల్లి మండల పరిధి మోకిల గ్రామంలో, సుబిసి సఫైర్ అపార్ట్మెంట్లో సద్దుల బతుకమ్మ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమ్యూనిటీ మహిళ అధ్యక్షురాలు చైత్రిక పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అపర ఆదిశక్తి అవతారం, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి మనల్ని అందరిని చల్లగా చూసే తల్లి, మనకు బతుకుని ఇచ్చే తల్లి బతుకమ్మ అని తెలిపారు. ప్రకృతిలోని గడ్డి పూలకు సైతం గౌరవం కల్పించిన ఉదాత్తమైన పండుగ మన బతుకమ్మ అని కొనియాడారు. ఆ తల్లి చూపు మనపై వర్షించాలని , సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తూ హిందూ బంధువులకు సద్దుల బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, అర్జున్, నేహార్షిత, అద్వీత, ఖుషి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు...

శంకర్ పల్లి: అక్టోబర్ 10 :(డైలీ రిపోర్ట్): శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలోని అయ్యప్ప రెడ్డి గూడెం కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ పండగ సందర్భం గా ఆడపడుచులు బతుకమ్మ ఆడుతూ ఆనందోత్సవాల మధ్య సంబరాలను ఘనంగా చేసుకున్నారు. అదేవిధంగా ఆడపడుచులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అనేది మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైన పండుగని వాళ్లు తెలిపారు. అదేవిధంగా శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలో గల సింగపూర్, భవాని నగర్, గణేష్ నగర్, ఫతేపూర్, రామంతపూర్, విఠలేశ్వర ఆలయం, హనుమాన్ నగర్, తదితర మున్సిపల్ కాలనీలలో ఆడపడుచులు ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించుకున్నారు.





## ఏజెన్సీలో మెరిసిన ఆణిముత్యాలు, ఆ ఇంట్లో అందరూ సరస్వతీ పుత్రికలే....

### కష్టపడి కూతుళ్లను ఉన్నత స్థానంలో నిలబెట్టిన తల్లిదండ్రులు

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామానికి చెందిన సంగి సోమయ్య సత్తెమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, పెద్ద కూతురు శిరీషకు వివాహం జరిపించగా అనూష మానసలు ఉద్యోగుల సాధించిన తర్వాతే పెళ్లి చేసుకుంటామని తెలపడంతో వారిని కూడా ఉన్నత చదువులు చదివించారు. మరోవైపు శిరీష పెళ్లి చేసుకున్న కానీ గ్రూప్-2 ఉద్యోగులకు ప్రిపేర్ అవుతూ ఉన్నత ఉద్యోగం కోసం చూస్తుంది. ఇదే క్రమంలో రెండో కూతురు అనూష ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాలలో టీచర్ ఉద్యోగం సాధించింది.మూడోకూతురు మానస కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. ఏజెన్సీ ప్రాంతంలో కష్టపడుతూ కూతుళ్ల ను చదివించిన సంగి సోమయ్య సత్తెమ్మ దంపతులను గ్రామస్తులు అభినందించారు.

## శంకర్ పల్లి మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**శంకర్ పల్లి : అక్టోబర్ 10 :(డైలీ రిపోర్ట్):** శంకర్ పల్లి మండల కేంద్రంలో గల ఎంపీడీవో సమావేశ మందిరంలో శంకర్ పల్లి మండలానికి సంబంధించిన, 75, షాదీ ముబారక్ మరియు కళ్యాణ లక్ష్మి చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకం ఒక వరంగా ఉందని ఆయన తెలిపారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులైనటువంటి వాళ్లు చెక్కులు పంపిణీ చేసినందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ని ఎంతో అభినందిస్తున్నామని వాళ్లు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా ఉన్నటువంటి యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు, గ్రామాలలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఎమ్మార్వో సురేందర్, ఎంపీడీవో వెంకయ్య గౌడ్, శంకర్ పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, శంకర్ పల్లి మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, లబ్ధిదారుల కుటుంబాలు, పాల్గొన్నారు

## ఘనంగా యువ నాయకుడు పూర్ణ చందర్ జన్మదిన వేడుకలు

శంకర్పల్లి అక్టోబర్ 10:(డైలీ రిపోర్ట్): శంకర్పల్లి మున్సిపల్ లో పూర్ణచందర్ జన్మదిన వేడుకలను గురువారం నాడు 2వ వార్డు కౌన్సిలర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మార్చి వార్డు సభ్యులు మధు మరియు నటరాజ్, నరేష్, మధు, శ్రీనివాస్, నిఖిల్, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.



## పట్వారీ శశిధర్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



దేవి శరన్నవరాత్రుల సంధర్భంగా పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పిజెఆర్ నగర్ లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో రంగు రంగుల పువ్వులను పొగుచేసి బొడ్డెమ్మలను అలంకరించి బతుకమ్మలను ఒకదగ్గర చేర్చి మహిళలు చిన్నారులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ,దండియా ఆడుతూ సందడి చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిది గా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, మాదాపూర్, హఫీజ్ పెట్ కార్పొరేటర్ లు పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ పండగల గొప్పతనం తెలుపుతూ భవిష్యత్తు తరాలకు మన పాతతరం కట్టుబాట్ల ను అందించాల్సిన బాధ్యత మన పై ఉందని తెలిపారు.ఈ వేడుకల్లో పాల్గొన్న ఏ ఒక్కరికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులను అభినందించారు.అనంతరం శశిధర్ మాట్లాడుతూ ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని ఇంతలా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపోయారు.కార్యక్రమంలో కాలనీ వాసులు,మహిళలు,చిన్నారులు తదితరులు భారీగా పాల్గొన్నారు.











## ఇంద్రకరణ్ లో పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

కంది అక్టోబర్ 10 డైలీ రిపోర్ట్ : సంగారెడ్డి జిల్లా ఇంద్రకరణ్ గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నల్లగండ్ల కృష్ణ , జనరల్ సెక్రటరీ జొన్నాడ మాధవరావు , జాయింట్ సెక్రెటరీ కొర్వని శ్రీనివాస్, జొన్నాడ యాదయ్య ట్రెజరర్ సమయ్య, యాదయ్య, జైపాల్, మల్లేష్, ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.



## బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తుక్కుగుడ మున్సిపల్ చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్

**మహేశ్వరం అక్టోబర్ 10(డైలీ రిపోర్ట్):** మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలలో గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్ పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పూలను దైవం గా పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జాపాల భావన సుధాకర్,రాజమోని రాజు, గ్రామ ఆడపడుచులు పెద్దెత్తున పాల్గొన్నారు%



## బతుకమ్మ... మళ్లీ రావమ్మా..

**కొత్తగూడ .అక్టోబర్ 10 :** కొత్తగూడ మండల పరిధిలోని పొగుళ్లపల్లి గ్రామ సమీపంలో గల గవర్నమెంట్ స్కూల్ లో గురువారము సద్దుల బతుకమ్మ వేడుక సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో సందడి చేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ , తదితరులు పాల్గొనారు .గ్రామస్తులు తెచ్చిన తీరొక్క పూలతో భక్తి శ్రద్ధలతో పేర్చిన బతుకమ్మలు మధ్యలో పెట్టి ఆట పాటలతో చక్కగా అది పాడారు. చివరికి



పోయిరా బతుకమ్మ మళ్లి రావమ్మా అంటూ భక్తి శ్రద్దలతో బతుకమ్మను సాగనంపారు బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగ ఎంతో ప్రాముఖ్యం చెప్పారు.





## రాయికోడ్ మండలంలో రైతుతో విద్యుత్తు మరమ్మతులు...

**పిర్యాదు చేసిన పట్టించుకోని విద్యుత్ అధికారులు సిబ్బంది.**

**రాయికోడ్ విద్యుత్ శాఖ పై అవినీతి ఆరోపణలు.**

రాయి కోడ్, అక్టోబర్ 10(డైలీ రిపోర్ట్): విద్యుత్ అధికారుల చేతివాటం ఆ మండల రైతులకు, ప్రజలకు శాపంగా మారింది. చేతి తడిపితే గాని పనులు జరగకపోవడం విద్యుత్ అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం నాగ్వార్ గ్రామానికి చెందిన రైతు అనిల్ పొలం వద్ద బావి దగ్గర కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అనిల్ ఫిర్యాదు చేసిన నాలుగు రోజులకు కదలి వచ్చిన విద్యుత్ లైన్ మెన్ డబ్బులు ఇస్తే గాని కరెంటు సమస్యను పరిష్కరించ బోనంటూ దాంట్లో పై అధికారికి వాటా ఇవ్వాలంటూ తనకేమీకే మిగలవు 500 రూపాయలు మిగులుతాయని డిమాండ్ చేశాడు. దీంతో చేసేది ఏమీ లేక బాధిత ఫిర్యాదుదారుడు అనిల్ 2000 రూపాయలు లైన్ మాన్ కు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. అయినప్పటికీ లైన్ మెన్ కరెంటు సమస్యను పరిష్కరించలేదు. దీంతో విసుగెత్తిపోయిన బాధితుడు ఏఈకి ఫోన్ చేసి లైన్ మాన్ కు డబ్బులు ఇచ్చినప్పటికీ తన సమస్యను పరిష్కరించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో బాధితుడు అనిల్ వద్ద మధ్యాహ్నం 1:19 నిమిషాలకు వేయించికున్న డబ్బులను తిరిగి 1:32 నిమిషాలకు అదే బాధితుడి రిటర్న్ ఫోన్ పే ద్వారా పంపించారన్నారు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈ లైన్ మెన్ ను మందలించారు. కానీ లైన్ మెన్ ఫిర్యాదు చేసిన బాధితుడు అనిల్ ను స్తంభం ఎక్కించి తనతోనే విద్యుత్ మరమ్మత్తులు చేశాడంటే నమ్మగలరా.. కానీ ఇదే నిజం. విద్యుత్ అధికారులు చేయాల్సిన పనిని ఫిర్యాదు దారులతోనే లైన్ మెన్ క్రింద నిల్చొని చేయిస్తుండడం గమనార్హం. లైన్ మెన్ లకు ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ ఫిర్యాదు దారులతోనే స్తంభం ఎక్కించి పనులు చేయించడం ఏంటని, అనుకోని అనివార్య ఘటనలు చోటు చేసుకుంటే బాధితుడు పరిస్థితి ఏంటి అంటూ స్థానికులు పెదవి విరుస్తున్నారు. విద్యుత్ సరఫరా లో మరమత్తులు చేయాల్సిన అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము ఇంకా ఎవరిని అడగాలంటూ ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు మొరపెట్టుకున్న స్పందించాని విద్యుత్ అధికారిపై తనను ఇబ్బందులకు గురి చేసిన లైన్ మాన్ పై చర్యలు తీసుకోవాలని బాధితుడు అనిల్ పేర్కొన్నారు.

## ఒకే ఇంట్లో నలుగురికి ఎంబీబీఎస్ సీట్లు

**సిద్దిపేట, అక్టోబర్ 10 (డైలీ రిపోర్ట్):** సిద్దిపేటకు చెందిన కొంక రామచంద్రం, శారద దంపతుల నలుగురు కుమార్తెలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లు పొందారు. పెద్ద కుమార్తె మమత 2018లో ఎంబీబీఎస్ సీట్ పొంది చదువు పూర్తి చేసి డాక్టర్ గా కొనసాగుతుంది. రెండో కుమార్తె మాధవి 2020లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొంది చదువుతుంది. ఈ సంవత్సరం మరో ఇద్దరు కుమార్తెలు రోహిణి, రోషిణి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందారని జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చినందుకు ఇది సాధ్యమైందని తండ్రి రామచంద్రం తెలిపాడు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన నలుగురిని గురువారం సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీష్ రావు అభినందించారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707